సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 2 । జూలై । 2023



ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలి

ఆర్టీసీ డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని ఈడీ పురుషోత్తం అన్నారు.

వివరాలు 8లో ▸



అర్చకుల ఆవేదన పట్టదా?

అర్చక, ఉద్యోగులకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 /22.9

వాతావరణం

ఉదయం నుంచి ఎండగా ఉంటుంది.
ఆకాశం మేఘావృతమై ఉంటుంది.
సాయంత్రం వేళ జల్లులు కురవచ్చు.

న్యూస్‌రీల్

నేరస్తులు తప్పించుకోవద్దు: ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: నేరస్తులు తప్పించుకోకుండా పోలీస్‌తో పాటు న్యాయ వ్యవస్థ కలిసి పని చేయాలని ఎస్పీ నరసింహ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం పీపీలు, ఏపీపీలు, కోర్ట్ లైజనింగ్ అధికారులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. నేర రహిత సమాజం తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్ష పడేవిధంగా కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది శ్రమించాలన్నారు. కోర్టు డ్యూటీ పోలీస్ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరస్తులకు శిక్ష పడేలా చేయాలన్నారు. కోర్టు వారెంట్స్, సమన్స్, ఎంసీ వర్టికల్స్‌పై పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న కోర్టు కానిస్టేబుల్ ఎప్పటికప్పుడు ఎన్‌బీడబ్ల్యూ నాన్ బెయిలబుల్ వారెంట్‌లను క్రమం తప్పకుండా అమలు పరచాలన్నారు. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైందని, నేర రహిత సమాజం తీర్చిదిద్దాలంటే నిందితులకు తప్పక శిక్షపడాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు దగ్గరి నుంచి కేసు పూర్తయ్యే వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన సాక్ష్యాలు, రుజువులు, సాక్షుల వాఙ్మూలంను కోర్టుకు సమర్పించడంలో కానిస్టేబుల్స్ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కేసుల్లో ఉన్న ఆస్తులను సరైన సమయంలో కోర్టులో డిపాజిట్ చేయాలన్నారు. కోర్టు ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌కు తెలియజేయాలన్నారు. కోర్టు క్యాలెండర్ నిత్యం అప్‌డేట్ చేయాలని, కేసు ట్రయల్స్ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పీపీ బెక్కెం జనార్దన్, పరందాములుగౌడ్, డీఎస్పీ రమణారెడ్డి, ఏపీపీలు, కోర్ట్ లైజనింగ్ అధికారులు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

టీ-హబ్‌లో 134 రకాల పరీక్షలు ప్రారంభం

పాలమూరు: తెలంగాణ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న టీ-హబ్‌లో 57రకాల పరీక్షల నుంచి 134 రకాల పరీక్షలను పెంచారు. దీన్ని జెడ్పీ చైర్‌పర్సన్, ముడా చైర్మన్ గంజి వెంకన్న ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు జూమ్ మీటింగ్ ద్వారా అప్‌గ్రేడేషన్ డయోగ్నొస్టిక్ టీ-హబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్ విఠల్‌రెడ్డి, జనరల్ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్, ప్రొఫెసర్ రాధ, నవల్ కిషోర్, ఆర్ఎంఓలు ప్రసన్నకుమార్, నగేష్, శిరీష పాల్గొన్నారు.

5న ఇంటర్వ్యూలు

పాలమూరు: ఉమ్మడి జిల్లాలోని 108, 102 అంబులెన్స్‌లో ఉన్న అత్యవసర మెడికల్ టెక్నీషియన్, డ్రైవర్ పోస్టులు భర్తీ చేయడానికి ఈనెల 5న పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు 108 ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేటినుంచి గురు పూర్ణిమ ఉత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని ద్వారకా మాయి బాబా మందిరంలో ఆదివారం నుంచి 4వ తేదీ వరకు గురుపూర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం కాగడహారతి, అభిషేకం, మహాగణపతి పూజ, అఖండ దీపారాధన, అంకురారోహణం, ప్రధాన కలశ పూజ,మహామంగళహారతి, ప్రదోషకాల పూజ, 3న మహాన్యాస పారాయణం, అష్టోత్తర శత క్షీర కుంభాభిషేకం, సామూహిక సాయివ్రతాలు, 4న అభిషేకం, దేవి హోమం పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పాలమూరుపై ఫోకస్..!

ప్రధాన రాజకీయ పార్టీల ప్రత్యేక నజర్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముఖ్య నేతల విస్తృత పర్యటనలు
- సొంతంగా సర్వేలు చేయించుకుంటున్న నాయకులు
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజుకున్న వేడి
- జంపింగ్‌లతో మారుతున్న రాజకీయ సమీకరణలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ 'పాలమూరు'లో రాజకీయ వేడి రాజుకుంది. ప్రధాన రాజకీయ పక్షాలన్నీ ఉమ్మడి జిల్లాపైనే ప్రత్యేక నజర్ వేశాయి. ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీతో పాటు అధికార పార్టీ బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య నేతల పర్యటనలతో నిత్య కోలాహలం నెలకొంది. మరోవైపు ఆయా పార్టీల అధిష్టానాలు నియోజకవర్గాల వారీగా సర్వేలకు ఉపక్రమించడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ రేపుతోంది. అదేవిధంగా మారుతున్న పరిణామాల క్రమంలో ఆయా సెగ్మెంట్లలో పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు ఆశావహులు సైతం సొంతంగా సర్వేలు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ బహిష్కృత నేత, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు వనపర్తి నియోజకవర్గానికి చెందిన అసమ్మతి నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్న క్రమంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై అన్ని రాజకీయ పార్టీలు జాగ్రత్తగా గమనిస్తున్నాయి.

■ బీఆర్ఎస్ నేతల వరుస పర్యటనలు..

ప్రధానంగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో జాప్యానికి సంబంధించి ప్రతిపక్ష పార్టీలు రాజకీయాస్త్రంగా మార్చుకుని విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పలు దఫాలుగా నిర్వహించిన సర్వేల్లో తేలిన లెక్కలు, మారుతున్న పరిణామాలను బేరీజు వేసుకుని బీఆర్ఎస్ అధిష్టానం దక్షిణ తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెంచింది. దీంతో పాటు క్రమం తప్పకుండా ముఖ్యనేతలు పాలమూరులో పర్యటిస్తున్నారు. సీఎం కేసీఆర్ ఒక్క జూన్ నెలలోనే రెండు పర్యాయాలు పర్యటించారు. ఆరో తేదీన నాగర్‌కర్నూల్, 12న జోగుళాంబ గద్వాల జిల్లాలో నూతన సమీకృత కలెక్టరేట్ భవనాలను ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మేలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో దివిటిపల్లిలో నిర్మించిన ఐటీ టవర్‌ను ప్రారంభించడంతో పాటు అమరరాజా బ్యాటరీ కంపెనీకి శంకుస్థాపన చేశారు. మళ్లీ జూన్ 8న మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్లలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. మంత్రి హరీశ్ రావు అచ్చంపేట, జడ్చర్ల, మంత్రి మల్లారెడ్డి జడ్చర్ల.. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దేవరకద్ర ఆర్వోబీ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. స్థానికంగా పాలమూరుకు చెందిన ఇద్దరు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటున్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవడంతో పాటు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు.

■ బీజేపీ సైతం..

ఉమ్మడి పాలమూరుపై పట్టు సాధించేందుకు బీజేపీ తీవ్రంగా శ్రమిస్తోంది. జోగుళాంబ సన్నిధి నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రెండో విడతలో ప్రజాసంగ్రామ యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. పాదయాత్రలో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో ఎండగట్టారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలోని ఏదో ఒక ప్రాంతానికి క్రమం తప్పకుండా వస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. ఇటీవల నాగర్‌కర్నూల్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ నిర్వహించిన నవ సంకల్ప సభలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు సంజయ్ పాల్గొన్నారు. కొన్ని రోజులకే మళ్లీ ఆత్మకూరులో నిర్వహించిన మక్తల్ నియోజకవర్గ సభకు హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపారు. మరోవైపు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంపై దృష్టి సారించి విస్తృతంగా పర్యటిస్తున్నారు. అలంపూర్, వనపర్తి, అచ్చంపేట, గద్వాల తదితర ప్రాంతాల్లో నిత్యం ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

కాంగీ'రేసు'లో దూకుడు..

ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పాలమూరుపై దృష్టి కేంద్రీకరించి దూకుడు పంచింది. పార్టీకి చెందిన ముఖ్య నేతలు ఉమ్మడి జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో పర్యటిస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నారు. స్థానిక సమస్యలే అజెండాగా ప్రజల్లోకి చొచ్చుకుని పోయేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఇటీవల మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా కొనసాగింది. జడ్చర్ల, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లో పలు ప్రాంతాల గుండా యాత్ర సాగింది. నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన కార్నర్ సభల్లో ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా నెలకొన్న సమస్యలపై భట్టి గళమెత్తారు. జడ్చర్లలో నిర్వహించినసభకు పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో పాటు హిమాచల్ సీఎం సుక్విందర్‌సింగ్, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన నిరుద్యోగ ర్యాలీ, సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్ పాల్గొని ప్రజాసమస్యలను లేవనెత్తడంతో పాటు అధికార పార్టీ వ్యవహార శైలిపై విమర్శలు గుప్పించారు. ఈ నెల 14 లేదా 16న కొల్లాపూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి బహిరంగసభ నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనాయకులతో పాటు మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్‌రెడ్డి తదితరులు హాజరుకానుండగా.. జూపల్లి, ఎమ్మెల్సీ తనయుడు కూచుకుళ్ల రాజేష్, తదితర నేతలు కాంగ్రెస్ కండువాలు కప్పుకోనున్నారు.

సాగునీటి వృథా..!



రామన్‌పాడు కుడికాల్వలో వృథాగా పారుతున్న నీరు

- మరమ్మతుకు నోచుకోని రామన్‌పాడు, భీమా కాల్వల షట్టర్లు
- లీకేజీలతో వృథా అవుతున్న సాగునీరు
- పట్టించుకోని అధికారులు

అమరచింత: రామన్‌పాడు ప్రధాన కుడికాల్వతో పాటు భీమా ఎత్తిపోతల పథకం సమాంతర కాల్వకు సాగునీటి విడుదలను నియంత్రించే షట్టర్ల మరమ్మతులో జాప్యం కొనసాగుతోంది. హెడ్ రెగ్యులేటర్ల వద్ద షట్టర్ల లీకేజీతో రెండేళ్లుగా సాగునీరు దిగువకు వృథాగా పారుతోంది. వేసవిలో ఆయకట్టుకు సాగునీరు అవసరం లేకున్నా షట్టర్ల లీకేజీ కారణంగా నిల్వ నీరంతా కాల్వల్లో పారుతోంది. హెడ్ రెగ్యులేటర్ల నిర్మాణ సమయంలో నాసిరకంగా ఏర్పాటు చేసిన షట్టర్లు తరచూ మొరాయిస్తుండటంతో లీకేజీలు ఏర్పడుతున్నాయి. అధికారులు మొక్కుబడిగా మరమ్మతులు చేయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నారు. ప్రధాన కాల్వల్లో సాగునీటి వృథాను నియంత్రించడంలో సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

భీమా ప్రధాన ఎడమకాల్వ..

జూరాల ప్రాజెక్టు కరకట్ట వద్ద నిర్మించిన భీమా ఎత్తిపోతల పథకానికి సాగునీటిని సరఫరా చేసే సమాంతర కాల్వ ప్రధాన హెడ్ రెగ్యులేటరీకి మరమ్మతులు చేపట్టకపోవడంతో రెండేళ్లుగా వేసవిలో సాగునీరు వృథాగా రామన్‌పాడు రిజర్వాయర్‌కు చేరుతోంది. దీంతో జూరాల ప్రాజెక్టులో నిల్వ నీటిమట్టం పడిపోవడంతో నిర్దేశించిన ఆయకట్టుకే సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. భీమా సమాంతర కాల్వ ద్వారా సాగునీరు వృథాగా పారుతుండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. జూరాల ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం ఉన్న రోజుల్లోనే ఎత్తిపోతల పథకాలకు సాగునీరు తరలించాలనే నిబంధన ఉన్నా భీమా ఎత్తిపోతల పథకం సమాంతర కాల్వ హెడ్ రెగ్యులేటరీ ద్వారా ఇందుకు విరుద్ధంగా నీరంతా వృథాగా పారుతోంది. రోజుకు 200 క్యూసెక్కుల వరకు నీరు కాల్వ వెంట లీకేజీ రూపంలో పారుతోంది. ఈ విషయమై భీమా ప్రాజెక్టు ఏఈఈ సుజన్ మాట్లాడుతూ.. సమాంతర కాల్వ షట్టర్ల లీకేజీ అంశాన్ని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించినట్లు వెల్లడించారు.

భీమా ప్రాజెక్టుకు సమాంతర కాల్వ



మరమ్మతులు చేపట్టాలి..



జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ సమీపంలో నిర్మించిన సమాంతర కాల్వ ప్రధాన హెడ్ రెగ్యులేటరీ వద్ద షట్టర్ల మరమ్మతు నాసిరకంగా చేయడంతో రోజు 200 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. దీంతో జూరాల బ్యాక్‌వాటర్‌లో నీటిమట్టం తగ్గడంతో పాటు ఎడమ కాల్వ ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– విష్ణువర్ధన్, రైతు, అమరచింత

పూర్తి చేసేందుకు చర్యలు..

భీమా ప్రధాన హెడ్ రెగ్యులేటరీతో పాటు రామన్‌పాడ్ కుడికాల్వ ప్రధాన కుడికాల్వ హెడ్ రెగ్యులేటరీల మరమ్మతులకు రూ.8.60 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశాం. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేయడం లేదు. కాల్వలకు సాగునీటిని వదిలే సమయానికి ప్రధాన షట్టర్ల మరమ్మతు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– శంకర్, ఏఈ, రామన్‌పాడు ప్రాజెక్టు

రామన్‌పాడు కుడికాల్వలో..

రామన్‌పాడు కుడికాల్వకు సంబంధించిన ప్రధాన హెడ్ రెగ్యులేటరీకి మరమ్మతులు చేపట్టకపోవడంతో లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రాజెక్టులోని నిల్వనీరు ఊకచెట్టు వాగులోకి చేరి అటు నుంచి తిరిగి కృష్ణానదిలోకి వృథాగా పారుతున్నా.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. షట్టర్ల మరమ్మతు ఏడాది కిందట చేసినా తిరిగి సమస్య తలెత్తింది. ఈ ఏడాది షట్టర్ల మరమ్మతుకు రూ.8.60 లక్షలు కేటాయించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. వానాకాలం సాగునీటిని విడుదల చేయాల్సిన సమయం ఆసన్నమవుతున్నా.. మరమ్మతులు పూర్తి కావడం లేదు. వేసవిలో పంటకాలం పూర్తయినా రోజుకు 100 క్యూసెక్కుల నీరు వృథాగా ఊకచెట్టు వాగు నుంచి కృష్ణానదిలోకి చేరుతోంది.



రిషి కళాశాల వద్ద పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రూప్-4

- జిల్లావ్యాప్తంగా 85 శాతం హాజరు
- పేపర్-1కు 4,919 మంది, పేపర్-2కు 5,030 మంది అభ్యర్థుల గైర్హాజరు
- ఆలస్యంగా వచ్చిన వారికి అనుమతించని అధికారులు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/గండేడ్/జడ్చర్ల టౌన్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రూప్-4 పరీక్ష చిన్నచిన్న సంఘటనలు మినహా జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్లలో 85శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలో 111 పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేయగా.. ఉదయం 10 గంటలకు పేపర్-1 పరీక్ష ప్రారంభమైంది. 34,459 మంది అభ్యర్థులకు 29,540 మంది హాజరు కాగా.. 4,919 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30కి ప్రారంభమైన పేపర్-2కు 29,429 అభ్యర్థులు హాజరు కాగా.. 5,030 మంది గైర్హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 85.73 శాతం అభ్యర్థులు హాజరు కాగా మధ్యాహ్నం 85.40 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు అయ్యారు. ఉదయం 8 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులు బారులు తీరడం కనిపించింది. అభ్యర్థులతో పాటు వచ్చిన బంధువులు, కుటుంబసభ్యులో ఆ చుట్టుపక్కల ప్రాంతాలు కిటకిటలాడాయి. మొత్తంగా పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

■ పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఇతరులను అనుమతి ఇవ్వలేదు. హాల్‌టికెట్‌తో పాటు ఏదో ఒక గుర్తింపు కార్డు చూయిస్తేనే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇచ్చారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు 144సెక్షన్‌ను అమలు చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేయగా.. అడిషనల్ కలెక్టర్ సీతారామారావు పర్యవేక్షించారు.

■ గండేడ్ మండలంలోని వెన్నాచేడ్‌లో మోడల్ స్కూల్, బాలుర ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేయగా.. కొందరు అభ్యర్థులు బాలుర ఉన్నత పాఠశాలకు బదులుగా మోడల్‌స్కూల్‌కు చేరుకున్నారు. అక్కడ నంబర్లు కనిపించకపోవడంతో కంగుతిన్న వారు అసలు విషయం తెలుసుకొని బాలుర పాఠశాలకు వెళ్లినా.. ఆలస్యం కావడంతో ఐదుగురు అభ్యర్థులకు అనుమతి నిరాకరించారు. ఆలస్యంగా రావడం, ఐడీ కార్డులు లేకపోవడం తదితర కారణాలతో జిల్లాలో దాదాపు వంద మంది అభ్యర్థుల వరకు అధికారులు అనుమతి నిరాకరించారు.

■ ఎస్పీ కె.నరసింహ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం లోపలికి వెళ్లే అభ్యర్థుల హాల్ టికెట్లను ఏఎస్పీ రాములుతో కలిసి కాసేపు తనిఖీ చేశారు.



■ కలెక్టర్ రవినాయక్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. గాంధీ రోడ్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు. పోలీసు యంత్రాంగం, రెవెన్యూ, జిల్లా అధికారులు, సిబ్బంది అందరి సహకారంతో గ్రూప్-4 పరీక్ష విజయవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ సీతారామారావు, ఎస్పీ నరసింహ, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు, రూట్ అధికారులు, ప్రత్యేక అధికారులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.





జడ్చర్లలో అనుమతి ఇవ్వాలని వేడుకుంటున్న ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి

■ జడ్చర్లలోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఓ మహిళ అస్వస్థతకు గురైంది. కొన్ని కేంద్రాల్లో బురఖా, మెడలో బంగారు గొలుసుల విషయంలో పలువురు మహిళలు అధికారులతో వాగ్వాదం చేశారు. ఆ తరువాత సద్దుమణిగింది. ఉదయం పరీక్ష రాసి.. మధ్యాహ్నం పేపర్-2కు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు కూడా అనుమతి ఇవ్వలేదు. పరీక్ష ముగిసిన తర్వాత మహబూబ్‌నగర్, జడ్చర్ల పట్టణాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కొత్తగా 4 రైళ్లు గద్వాల స్టేషన్‌లో నిలుపుదల

గద్వాల: గద్వాల రైల్వే జంక్షన్‌లో కొత్తగా నాలుగు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రయోగాత్మకంగా ఆపేందుకు రైల్వేబోర్డు అనుమతించింది. ఈ మేరకు సంబంధిత శాఖలకు ఉత్తర్వులు అందాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం నాగర్‌సోల్ (మహారాష్ట్ర)- చెన్నై ఎక్స్‌ప్రెస్, అంబేద్కర్‌నగర్ (మధ్యప్రదేశ్)- యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, జైపూర్- మైసూర్ ఎక్స్‌ప్రెస్, వాస్కో- హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లను ఇక నుంచి గద్వాల స్టేషన్‌లో నిలపనున్నారు. కొన్ని నెలలపాటు ట్రాఫిక్‌ను సమీక్షించి తుది నిర్ణయం తీసుకుంటారని రైల్వే అధికారులు తెలిపారు.

వైద్యులకు సన్మానం

పాలమూరు: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ మాట్లాడుతూ బీసీ రాయ్ ఆశయాలను ఆదర్శరంగా తీసుకుని వైద్యులు పని చేయాలని, వైద్య సేవలు అవసరం అయిన ప్రతి ఒక్కరికి సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు చలపతిరావు, కార్యదర్శి నాగభూషణం, రాజసింహుడు ఇతర వైద్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పతనం తప్పదు

- టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి పతనం తప్పదని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. శనివారం జడ్చర్ల మండలంలోని ఈర్లపల్లితండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. అన్ని రంగాలను ఇబ్బందుల పాలు చేసిన సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. దోచుకోవడం, దాచుకోవడం తప్పా అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. ఆర్టీసీ బస్సు చార్జీలు, విద్యుత్ చార్జీలు, ఇంటిపన్నులు తదితర అనేక రకాలుగా పేదలపై భారం మోపారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం తండాకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి అనిరుధ్‌రెడ్డి కండువాలు వేసి ఆహ్వానించారు. అంతకు ముందు ఆయన పార్టీ జెండా విష్కరించారు. కాగా.. ఆదివారం ఖమ్మంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ ముగింపు సందర్భంగా నిర్వహించనున్న రాహుల్‌గాంధీ సభకు జడ్చర్ల నియోజకవర్గం నుంచి అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలాదిమంది కార్యకర్తలు తరలివెళ్లనున్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో అనిరుధ్‌రెడ్డి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



అడ్డాకుల: ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో మృతిచెందిన సంఘటన మండలంలోని శాఖాపూర్ శివారులో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లికి చెందిన చవాన్ అశోక్(36) సంచార జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్ల కిందట తన కుటుంబంతో కలిసి శాఖాపూర్‌కి వచ్చి గొడ్డళ్లు, కొడవళ్లు తయారు చేసే పనులు చేస్తుండే వాడు. ఈ క్రమంలో శాఖాపూర్ నుంచి మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లికి వెళ్తున్నాడు. ఇందులో భాగంగా శనివారం కుటుంబ సభ్యులు తమ లగేజీని ఆటోలో కొమిరెడ్డిపల్లికి తీసుకెళ్లారు. కొంతసేపటి తర్వాత టీవీఎస్ మోపెడ్‌పై అశోక్ శాఖాపూర్ నుంచి కొమిరెడ్డిపల్లికి బయలుదేరాడు. శాఖాపూర్ సర్వీస్ రోడ్డు దాటి హైవే వద్ద రోడ్డు క్రాసింగ్ చేస్తుండగా.. ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి అశోక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన బాధితుడిని స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలియజేశారు. అతని కుమారుడు బన్నీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని నెల్లికొండలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు.. నెల్లికొండకు చెందిన శ్రీలత (27) కుటుంబంలో కొంతకాలంగా కలహాలు చోటుచేసుకున్నాయి. మనస్థాపానికి గురై ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలి తల్లి మనెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

కందనూలు: బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన సామ వెంకటేష్ (46) శనివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లికి చెందిన వెంకటేష్ భార్య తనతో ఉండటం లేదని కొంతకాలంగా బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించేసరికి మృతి చెందాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

కాల్వలో పడి వృద్ధుడి గల్లంతు

నర్వ: మండలంలోని ఎల్లంపల్లికి చెందిన సవరప్ప కోయిల్‌సాగర్ కాల్వలో గల్లంతైన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సవరప్ప గ్రామంలో ఆసరా పింఛన్‌ను తీసుకోని గ్రామానికి సమీపంలో ఉన్న కోయిల్‌సాగర్ కాల్వలో స్నానం చేయడానికి దిగాడు. కాల్వ లోతుగా ఉండడంతో కాల్వలో జారిపడి ఉంటాడని తెలిపారు. చుట్టు పక్కల పొలాల రైతులు కాల్వలో గాలింపు చేపట్టిన ఆచూకీ లభించలేదు





మహబూబ్‌నగర్‌లోని పరీక్ష కేంద్రం సెల్‌ఫోన్ కౌంటర్ వద్ద బారులుతీరిన అభ్యర్థులు, మెటల్ డిటెక్టర్‌తో అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న సిబ్బంది



అభ్యర్థి గుర్తింపు కార్డు పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ ఎస్పీ కె.నరసింహ





జడ్చర్లలో చివరి నిమిషంలో పరుగెత్తుకుంటూ వస్తున్న అభ్యర్థులు



గద్వాలలోని జూనియర్ కళాశాల వద్ద అనుమతించాలని కోరుతున్న ఓ యువతి



మహబూబ్‌నగర్‌లో పరీక్ష రాసి బయటికి వస్తున్న అభ్యర్థులు

కొలువు కోసం కొండంత ఆశతో..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన గ్రూప్‌-4 పరీక్ష ప్రశాంతంగా కొనసాగాయి. అధికారుల సూచనల మేరకు అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. అక్కడక్కడ కొందరు చివరి నిమిషంలో వచ్చి ఆందోళనపడ్డారు. అయితే పరీక్ష ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో నిర్వహించడంతో అభ్యర్థులు కేంద్రాల వద్దే వేచి చూడాల్సి వచ్చింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు మధ్యాహ్నం సమయంలో భోజనాలు, తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. చిన్న చిన్న ఘటనలు మినహా పరీక్షలు ప్రశాంతంగా కొనసాగడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

– సాక్షి నెట్‌వర్క్



జడ్చర్లలో అస్వస్థతకు గురైన అభ్యర్థినిని బయటకు తీసుకొస్తున్న ఆశ కార్యకర్త



అమ్మకు ఆల్ ది బెస్ట్.. మహబూబ్‌నగర్‌లో



అమరచింతలో మనువరాలిని నిద్రపుచ్చుతూ..



మక్తల్‌లో పిల్లలకు అన్నం తినిపిస్తూ..

ఎర్రగట్టు వద్ద చిరుత సంచారం?

- పరిశీలించిన అటవీశాఖ అధికారులు

గట్టు: చిన్నోనిపల్లె పునరావాస కేంద్రం సమీపంలోని ఎర్రగట్టు వద్ద శనివారం చిరుత పులి సంచరిస్తూ కనిపించినట్లు లింగాపురం చెందిన వ్యక్తి చెప్పిన సమాచారం ఆయా గ్రామాల ప్రజలను కలవరానికి గురి చేసింది. లింగాపురం చెందిన వెంకట్‌రెడ్డి తన ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి అయిజకు వెళ్తుండగా చిన్నోనిపల్లె పునరావాస కేంద్రం సమీపంలోని ఎర్రగట్టు దగ్గర చిరుత పులి కన్పించడంతో భయభ్రాంతులకు గురై అక్కడి నుంచి వెనక్కి వచ్చి గ్రామంలో విషయాన్ని తెలియజేశాడు. దీంతో లింగాపురం గ్రామస్తులు విషయాన్ని అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లింగాపురం, చిన్నోనిపల్లె, అంతంపల్లి, చాగదోణకు చెందిన వారు డిప్యూటీ రేంజర్ రాఘవేంద్రతో కలసి ఎర్రగట్టు, చుట్టు పక్కల ప్రాంతాల్లో చిరుత పులి ఆనవాళ్లను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి గుర్తులు కన్పించలేదని అధికారి తెలిపారు. అడవి పిల్లిని చూసి, చిరుత పులి అనుకుని ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. చిరుతపులి సంచారం పుకార్లు షికార్లు చేయడంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు ఆందోళన చెందుతున్నారు.



ఎర్రగట్టు వద్ద పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారి, గ్రామస్తులు

ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని రిలే దీక్షలు

మరికల్: మండలంలోని చిత్తనూర్ శివారులో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని కంపెనీ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం నుంచి నిరవధిక రిలే దీక్షలు ప్రారంభించారు. పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడారు. కంపెనీ ప్రారంభమైతే దాంతో వేదజల్లే ప్రమాదకర విషవాయువుల నుంచి జీవకోటికి ప్రమాదం పొంచి ఉందన్నారు. కంపెనీ చుట్టూ ఉన్న 20 కిలోమీటర్ల దూరంలోని అన్ని గ్రామాల ప్రజలు ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ఉద్యమం చేపడితేనే ఇక్కడి నుంచి కంపెనీ రద్దు చేసే అవకాశం ఉందన్నారు. లేకుంటే రాబోవు పదేళ్లలో ఇక్కడి ప్రాంతాలు కలుషితమవుతాయన్నారు. ఏకతాటిపై కలిసికట్టుగా పోరాటాలు చేసి కంపెనీని తరిమేద్దామని పిలుపునిచ్చారు. అంత వరకు నిరవధిక రిలే దీక్షలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

వ్యక్తి గొంతుకోసిన దుండగులు

- రెండ్రోజులుగా ముళ్లపొదల్లో నరక యాతన
- గుర్తించిన పశువుల కాపరులు

జడ్చర్ల: మండలంలోని శివగిరి క్షేత్రం సమీపంలో ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వారు కత్తితో దాడి చేశారు. గొంతు కోయడంతో అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చనిపోయాడని భావించి పక్కనే ఉన్న ముళ్లపొదలు, దట్టమైన చెట్లమధ్య పడవేసి వెళ్లిపోయారు. రెండ్రోజుల తర్వాత అటువైపు వెళ్లిన పశువుల కాపరులు మూలుగుతున్న శబ్దాన్ని గమనించారు. దగ్గరికి వెళ్లి పొదలో ఓ వ్యక్తి ఉన్నట్లు గుర్తించి జడ్చర్ల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు 108కు తెలియజేశారు. వారు అతన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గొంతు కొంతభాగం తెలగడంతో మాటరాని పరిస్థితి ఉండగా ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా అతన్ని భూత్పూర్ మండలం కర్వెనకు చెందిన వెంకటయ్య(45)గా గుర్తించామని, గత నెల 29న సంఘటన జరిగి ఉంటుందని సీఐ రమేష్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో ఉంటూ టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారని, మిత్రులతో కలిసి మద్యం తాగారని తెలిసిందని చెప్పారు. ఈ మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



గొంతుపై గాయంతో వెంకటయ్య

ఏకాగ్రతతో సురక్షితమైన డ్రైవింగ్ చేయాలి



మాట్లాడుతున్న ఈడీ పురుషోత్తం

- ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం
- ఆర్టీసీ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించి సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం అన్నారు. ఆర్టీసీ డ్రైవర్లకు టీఏసీటీలో భాగంగా జిల్లాకేంద్రం బస్టాండ్‌లోని రీజియన్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ డ్రైవర్లకు సురక్షితమైన డ్రైవింగ్‌పై సలహాలు, సూచనలు చేశారు. ఆర్టీసీ సంస్థ రోడ్డు భద్రత, ప్రయాణికుల భద్రతకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్ చూసుకుంటూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. ఏకాగ్రతతో ప్రశాంత వాతావరణంలో సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. ప్రయాణికుల మన్ననలు పొందాలని, ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీజియన్‌లోని డిపోల నుంచి ప్రతి రోజు 100 మంది డ్రైవర్లకు రెండు బ్యాచ్‌ల చొప్పున శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం తమ సర్వీసులో ఎలాంటి ప్రమాదాలు చేయని ఇద్దరు డ్రైవర్లను ఈడీ పురుషోత్తం ఘనంగా సన్మానం చేశారు. అదే విధంగా జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ క్లినిక్ వైద్యుడిని సన్మానం చేశారు. ఆదివారం ప్రారంభం కానున్న అరుణాచలం గిరి ప్రదక్షణకు సంబంధించి ప్రత్యేక బస్సులపై అధికారులతో ఈడీ సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ డిపో నుంచి అరుణాచలంకు ఆరు బస్సులు బుకింగ్ కాగా ఉద్యోగులను ఈడీ అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు శ్యామల, బాబునాయక్, డిపో మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లను సన్మానిస్తున్న ఈడీ పురుషోత్తం

నత్తనడకన..!

ఏళ్లుగా కొనసాగుతున్న నెట్టెంపాడు కాల్వల పనులు

- నేటికీ పారని సాగునీరు
- డీజిల్ ఇంజిన్లతో తోడుకుంటున్న రైతులు
- తడిసి మోపెడవుతున్న పెట్టుబడులు



నెట్టెంపాడు నీటిని కాలువలకు మళ్లించుకున్న రైతులు



పొక్లెయిన్‌తో కాల్వ తవ్వుకుంటున్న రైతులు

అయిజ: నడిగడ్డ రైతులకు నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందిస్తామని నాయకుల ప్రసంగాలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారినా... నెట్టెంపాడు కాల్వల పనులు నత్తనడకన సాగుతుండటంతో నేటికీ సాగునీరు అందడం లేదు. ప్రాజెక్ట్‌లో భాగంగా వివిధ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి 15 ఏళ్లవుతోంది. సంగాల, తాటికుంట, నాగర్‌దొడ్డి, చిన్నోనిపల్లి, ముచ్చోనిపల్లి రిజర్వాయర్ల ద్వారా జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నెట్టెంపాడు ప్రాజెక్టు చేపట్టారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తయినా కాల్వ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో ప్రతి ఏటా పంటలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది వానాకాలం, యాసంగిలో సాగు చేసిన వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, కంది, పత్తి, ఆముదం పంటలకు సాగునీరందక రైతులు నష్టాలను చవి చూశారు. సరైన సమయంలో వర్షాలు కురువకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. కళ్ల ముందే నెట్టెంపాడు ప్రాజెక్టులో నీరున్నా.. అసంపూర్తి కాల్వలతో పంటలకు నీరందని దుస్థితి నెలకొంది.

సొంత ఖర్చులతో..

అసంపూర్తిగా ఉన్న కాల్వలను రైతులు సొంత ఖర్చులతో పూర్తి చేసుకుంటున్నారు. ఇందుకోసం ఒక్కో రైతు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వెచ్చించారు. కాల్వల్లో పైపులు వేసుకొని డీజిల్ ఇంజిన్ల సాయంతో పంటలకు సాగునీరు తరలించుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాల్వ పనులు త్వరితగతిన పూర్తిచేసి వచ్చే ఏడాది వానాకాలం నాటికైనా కాల్వల ద్వారా సాగునీరు అందించాలని కోరుతున్నారు.



డీజిల్ ఇంజన్లతో సాగునీటి సరఫరా

అసంపూర్తిగా కాల్వ పనులు..



నెట్టెంపాడు కాల్వల కోసం ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకుంది. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తి కావడం లేదు. వర్షాలు కురువనప్పుడు రిజర్వాయర్లలోని నీటిని కాల్వల నీటిని మళ్లించి పంటలను తడుపుకోవచ్చని ఆశపడ్డాం. ఇప్పటి వరకు కాల్వ పనులు పూర్తి కాలేదు.

– వేణుగోపాల్‌రెడ్డి, రైతు, వెంకటాపురం

ఏళ్లుగా ఎదురుచూపులే..



నెట్టెంపాడు ప్రాజెక్ట్ నుంచి పంటలకు నీరందుతుందని ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. పొలాల్లో యంత్రాలతో కాల్వలు తవ్వి అసంపూర్తిగా వదిలేశారు. రిజర్వాయర్‌లో నీళ్లున్నా లాభం లేకుండా పోతోంది. కాల్వలు తవ్వకపోయి ఉంటే ఆ స్థలంలో పంటలు సాగుచేసుకునే వాళ్లం.

– రంగస్వామి, రైతు, అయిజ

ఏడాదిలో పూర్తిచేస్తాం..

నెట్టెంపాడు ప్రాజెక్ట్ కాల్వల పనులు దాదాపుగా పూర్తవుతున్నాయి. 100వ ప్యాకేజీ పెండింగ్‌లో ఉంది. మిగిలిన ప్యాకేజీల్లో పనులు చివరి దశకు చేరుకున్నాయి. భూ సేకరణ విషయంలో కొన్ని అడ్డంకులు తలెత్తుతున్నాయి. సమస్యలన్నింటిని పరిష్కరించుకొని డిసెంబర్ చివరి నాటికి పనులు పూర్తిచేస్తాం.

– శ్రీనివాసరావు, ఎస్‌ఈ, నెట్టెంపాడు ప్రాజెక్టు